క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



గుడివాడటౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుడివాడ మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావును మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు కొత్తా సుబ్బారావు, సయ్యద్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి గ్రామోత్సవం

పామర్రు: దేవీ శరన్నవరాత్రులను ముగించుకుని ఆదివారం రాత్రి అంకమ్మతల్లిని గ్రామ పురవీధులలో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో విచిత్ర వేషధారణలతో గ్రామంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారి వెంబడి తరలిరాగా ఊరేగింపు స్థానిక ఆలయం నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా గ్రామంలోని శివాలయం వీధి నుంచి జమ్మిచెట్టు సెంటర్, గుడివాడ రోడ్డు మీదుగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర స్వామి వారి ఆదాయం రూ.2.73 లక్షలు



గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఆలయ తనిఖీ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో జరిగిన లెక్కింపులో రూ.2 లక్షల 73 వేల 515 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

16 నుంచి పాఠశాలల వార్షిక తనిఖీలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పాఠశాలల వార్షిక తనిఖీలు ఈ నెల 16 నుంచి జరుగుతాయని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నిరకాల రికార్డులు, పాఠ్యాంశాల ప్రణాళికలు, డైరీలు సిద్ధంగా ఉంచాలన్నారు. తనిఖీ తేదీల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయరని స్పష్టం చేశారు. ఈ నెల 16న స్థానిక గౌతమ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్, 19న ముదినేపల్లి తూర్పు ప్రాథమిక పాఠశాల, 26న చినకామనపూడి, 28న సింగరాయపాలెం, 30న కాకరవాడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో వార్షిక తనిఖీలు జరుగుతాయని అందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నైట్ వాచ్‌మన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నైట్‌వాచ్‌మన్‌గా నిబంధనలకు లోబడి విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రభ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.6వేల గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తులను వ్యక్తిగతంగా ఈనెల 22 వ తేదీ లోపు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల లోపు కళాశాలలో అందజేయాలని కోరారు.

మద్యం దుకాణాల కేటాయింపు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో మద్యం వ్యాపారులకు ఉత్కంఠ వీడింది. నియోజకవర్గంలో కై కలూరు మండలంలోని 8 దుకాణాలకు 195, కలిదిండి మండలంలో 5 దుకాణాలకు 179, మండవల్లి మండలంలో 3 దుకాణాలకు 86, ముదినేపల్లి మండలంలో 5 దుకాణాలకు 128 మొత్తం 588 దరఖాస్తులు అందాయి. సోమవారం లక్కీ డ్రా ద్వారా ఏలూరులో జరిగిన దుకాణ కేటాయింపులలో కైకలూరు మండలానికి సంబంధించి వెలగపూడి శ్రీనివాస ప్రసాద్(షాపు నంబరు 108), లింగంనేని సుధాకరబాబు (109), తలారి వెంకట రామారావు(110), నల్లబోతు కృష్ణకాంత్(111), రామిశెట్టి శ్రీనివాస్ (112), కాట్రగడ్డ అనిల్‌కుమార్(113), మానికొండ మధుసూదనరావు (114), కాట్రగడ్డ అనిల్‌కుమార్ (115) కలిదిండి మండలంలో అక్కల వెంకటాచలం (116), దర్శి వెంకటేశ్వరరావు (117), రాయని వెంకటేశ్వర్లు (118), వాలిశెట్టి గణేష్ (119), పాలడుగు వెంకట శివ నాగదుర్గాప్రసాద్ (120) మండవల్లి మండలంలో రాయని వెంకటేశ్వర్లు (126), బుసనబోయిన శ్రీరాములు (127), అల్లూరి వెంకట సత్యనారాయణరాజు (128), ముదినేపల్లి మండలంలో దాసి గణేష్ (132), గుల్లిపల్లి ఆంజనేయులు (133), నామన పవన్ దుర్గా ప్రశాంత్ (134), అరుగుల సుబ్బారావు (135), కోడూరు వెంకట శేషుకుమార్ (136) దక్కించుకున్నారు. కాట్రగడ్డ అనిల్‌కుమార్, రాయని వెంకటేశ్వర్లుకు ఒక్కొక్కరికీ రెండు దుకాణాలు దక్కడం గమనార్హం.

ఈ రహదారికి మోక్షం లేదా?



గోతులమయంగా మారిన చినకామనపూడి-లింగాల రహదారి

ముదినేపల్లి రూరల్: రెండు మండలాలను కలిపే ప్రధానమైన చినకామనపూడి-లింగాల పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా మారింది. మండలంలోని చినకామనపూడి నుంచి మండవల్లి మండలం లింగాల 165వ నంబరు జాతీయ రహదారి వద్ద కలిసే ఈ పంచాయతీరాజ్ రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక గోతుల మయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు సైతం ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. బంటుమిల్లి, ముదినేపల్లి మండలాల్లోని పలు గ్రామాల నుంచి కైకలూరు వెళ్లేందుకు ఈ రోడ్డు వలన అనేక కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనితో ఈ రోడ్డు మార్గం గుండా పలువురు వాహనదారులు ప్రయాణిస్తుంటారు. చినకామనపూడి సమీపంలో గతంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాలు ముమ్మరంగా జరిగేవి. ఈ ప్రాంతంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు వెలికితీసేవారు. దీంతో కార్పొరేట్ సామాజిక బాధ్యతగా నిధులు కేటాయించి ఓఎన్‌జీసీ ఈ రోడ్డును అభివృద్ధి చేసింది. కాలక్రమేణా ఈ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడంతో రహదారి అభివృద్ధిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. దీంతో గత ఆరేళ్లుగా ఈ రహదారి ఎలాంటి అభివృద్ధికి నోచుకోక సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోక తీవ్ర నిర్లక్ష్యానికి గురై స్వరూపాన్ని కోల్పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ నవీన్‌కుమార్

పమిడిముక్కల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల రాబోయే మూడు రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాడుబడిన ఇళ్లలో ఉండరాదని అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలియజేశారు.

ఇసుకను డంప్ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు

పమిడిముక్కల: ఎడ్లబండ్లతో ఇసుకను తరలించి డంప్ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని లంకపల్లి, అప్పారావుపేట ఇసుక క్వారీల నుంచి సాయంత్రం 6 గంటల తర్వాత ఎడ్ల బండ్లతో ఇసుకను తరలించడం నిషేధించినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక తరలించకుండా క్వారీల వద్ద వీఆర్వో, వీఆర్‌ఏలను కాపలాగా ఉంచినట్లు తెలియజేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ రవికాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అండర్ పాస్‌తో అవస్థలు



కురుమద్దాలి వద్ద ఉన్న అండర్ పాస్‌లో నిల్వ ఉన్న వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు

పామర్రు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో నియోజకవర్గ పరిధిలో పమిడిముక్కల మండలం మంటాడ గ్రామం వద్ద, పామర్రు మండలం కురుమద్దాలి, పామర్రు-గుడివాడ రహదారి కలిసే చోట అండర్ పాస్‌లను ఏర్పాటు చేశారు. ఈ అండర్ పాస్‌లు రహదారి కన్నా పల్లంగా ఉండటం వలన వర్షపు నీరు అక్కడి చేరి నిల్వ ఉండిపోతోంది. దీంతో వర్షాలు కురిసినప్పుడు వారం రోజుల పాటు నీరు అక్కడే నిల్వ ఉండిపోతోంది. దీనివలన అండర్ పాస్ గుండా వాహనాలు ప్రయాణించాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. దీనికి తోడు అదే ప్రాంతంలో గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోందని వాహన చోదకులు వాపోతున్నారు. అండర్ పాస్‌లో మంటాడ వద్ద, కురుమద్దాలి వద్ద ఇబ్బందికరంగా ఉండటం వలన ఆర్టీసీ బస్సులు రహదారికి కుడి వైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. ఎదురు ప్రయాణం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అండర్ పాస్ వద్ద నీటిలో గుంతలు ఏర్పడి అవి వాహనదారులకు కనబడక పడిపోవడం వలన ద్విచక్ర వాహనాలు గుంతలలో పడిపోయి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్ పాస్‌ల వద్ద నిల్వ ఉంటున్న నీటిని తొలగించే ప్రక్రియ చేపట్టాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అధికార పార్టీ నేతలకే మద్యం టెండర్లు

పామర్రు: నియోజకవర్గంలోని పామర్రు, మొవ్వ, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి మండలాలలో ఉన్న మద్యం దుకాణాలలో ఎక్కువ శాతం టీడీపీ నేతలే దక్కించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం దుకాణాల కోసం చేసుకున్న దరఖాస్తులకు సోమవారం లాటరీని నిర్వహించారు. మొత్తం 46 మంది ఒక్కొక్కరు రూ.2లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 16 మందికి మాత్రమే అదృష్టం దక్కింది. మద్యం దుకాణాలు దక్కిన వారిలో కూటమి పార్టీలకు చెందిన సభ్యులే ఎక్కువ మంది ఉన్నారు. కూటమి పార్టీలకు చెందని వారు తక్కువ మంది ఉన్నారు. అయితే దీనిని కూడా కూటమి సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. తమ వారు కాకుండా, మిగిలిన దుకాణాలు పొందిన వారికి అధికార పార్టీ నేతలు ఫోన్ చేసి తమకు రావాల్సిన వాటాలను ఎప్పటికప్పుడు తమకు ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. ఒక వేళ ఇవ్వక పోతే మీ దుకాణాలు సక్రమంగా నడవవని, అక్రమ కేసులు బనాయిస్తామంటూ బెదిరింపు కాల్స్ వస్తున్నట్లు లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న ఇతరులు వాపోతున్నారు.



పామర్రులోని ఓ మద్యం దుకాణం

నియోజకవర్గంలో మద్యం లక్కిక్కు పొందిన వారు వీరే!

పామర్రు మండలంలో నాలుగు మద్యం దుకాణాలను నెరుసు హరికృష్ణ ప్రసాద్, చిలంకుర్తి అశోక్, నందిపాటి పూర్ణచంద్రారెడ్డి, సంగం గిరిధర్‌రెడ్డి దక్కించుకున్నారు. మొవ్వ మండల పరిధిలోని నాలుగు దుకాణాలను బొమ్మినేని శ్రీధర్‌రావు, మురారి శివ నాగరాజు, కర్ల పద్మావతి, గీత మహేష్‌భాటీ దక్కించుకున్నారు. పెదపారుపూడి మండలంలో రెండు దుకాణాలను కాగిత లక్ష్మీ నారాయణ, అంగడాల శ్రీనివాస రావు పొందారు. పమిడిముక్కల మండలంలో మూడు మద్యం దుకాణాలను తాతినేని శివరామ్ ప్రసాద్, టి.కృష్ణ, గంజాల ఫణివాసబాబు దక్కించుకున్నారు. తోట్లవల్లూరు మండలంలోని మూడు దుకాణాలను జొన్నల బసివి రెడ్డి, మోర్ల సాంబశివరావు, భరనాల శివకుమార్ దక్కించుకున్నారు.

సిండికేట్ల వలన మద్యం రేట్లు ప్రశ్నార్థకం

అందరూ సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలను చేజిక్కించుకోవడంతో మద్యం ధరలు ఏ స్థాయిలో ఉంటాయోనని మద్యం బాబులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ధరల ప్రకారం దుకాణాలలో అమ్మకాలు జరిగితే ఇబ్బందిలేదు కాని సిండికేట్‌గా ఏర్పడి రేట్లను దుకాణదారులే నిర్ణయించి అమ్మకాలు చేస్తే మద్యం బాబుల జేబులకు చిల్లులు పడే అవకాశాలు ఉంటాయని మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు.

బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్జి

కైకలూరు: కైకలూరు కాలేజీ బీసీ బాలికల హాస్టల్‌ను కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ వీవీఎన్‌వీ లక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) సూచనల మేరకు వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై నివేదికలను జడ్జిలు పంపుతున్నారు. ఇందులో భాగంగా సీనియర్ జడ్జి లక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించి, భోజనశాల, తాగునీటి వసతులపై ఆరా తీశారు. కాలేజీ బీసీ హాస్టల్ వార్డెన్ ఎం.రాధ జనవరి నెల నుంచి బిల్లులు సక్రమంగా అందడం లేదని జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థినులు మాట్లాడుతూ మహిళలకు అవసరమైన కాస్మొటిక్ చార్జీలను కొన్ని సంవత్సరాలుగా నిలుపుదల చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. జడ్జి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పానల్ న్యాయవాదులు పిచ్చికల పవన్‌కాంత్, పత్తే ప్రసన్నకుమార్, ఎంఎల్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



కైకలూరు కాలేజీ బీసీ హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న సీనియర్ జడ్జి లక్ష్మి

17న వ్యవసాయ సొసైటీ పెట్రోల్ బంక్ ప్రారంభం



గుడ్లవల్లేరు: కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను గురువారం మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రారంభించనున్నట్లు టీడీపీ నాయకుడు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈ పెట్రోల్ బంక్ నిర్మాణానికి హెచ్‌పీసీఎల్ వారు రూ.50 లక్షలు ఖర్చు చేశారని చెప్పారు. తమ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరఫున రూ.20లక్షలను వెచ్చించినట్టు వివరించారు.

పాడి రైతులకు సంక్షేమ పథకాలు

గుడ్లవల్లేరు: పాడి రైతుల కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఆయన మండలంలోని శేరీ దగ్గుమిల్లి, విన్నకోట, అంగలూరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని సన్మానించారు. కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ, ప్రమాద బీమా పథకాలను పాడి రైతులకు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. మిల్క్ యూనియన్ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, పాల సొసైటీ అధ్యక్షురాలు భూబత్తిన కాశేశ్వరమ్మ, శాయన హరిప్రసాద్, పాలపర్తి నరసింహారావు, సూపర్‌వైజర్ గోరంట్ల గోపిరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

కాజలో ప్రారంభమైన పల్లె పండుగ

కాజ(మొవ్వ): పల్లె పండుగ ప్రగతికి సోపానమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మొవ్వ మండలం కాజ గ్రామంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాజ గ్రామంలో రూ.35 లక్షలతో మంజూరైన సిమెంటు రహదారుల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా నియోజకవర్గంలో రూ.24 కోట్ల వ్యయంతో 400కు పైగా అంతర్గత రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొడాలి భవాని, ఎంపీడీవో విమాదేవి, పంచాయతీ రాజ్ ఏఈ వాసుదేవరావు, కూటమి నాయకులు లింగమనేని రామలింగేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, యార్లగడ్డ చందు తదితరులు పాల్గొన్నారు.



కాజ గ్రామంలో రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

శ్రీ సిద్ధేశ్వరాలయంలో విగ్రహాల సంప్రోక్షణ



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీమద్గంగా పార్వతీ దేవి సమేత సిద్ధేశ్వరాలయంలో నూతన ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ జరిగింది. సోమవారం ఉదయం ఆలయ ధ్వజ, శిఖర పునః ప్రతిష్ఠను వేద పండితులు చేపట్టారు. అనంతరం మహా పూర్ణాహుతి, అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, ఆలయ నిర్వాహకుడు కొసరాజు వెంకటాద్రిచౌదరి(పెద బాబు) తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల విషయంలో అప్రమత్తం

విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు

పమిడిముక్కల: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వలన భారీ వర్షాలు, విపరీతమైన గాలులు వీచే అవకాశముందని, విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా వినియోగదారులు, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ శ్రీనివాసరావు హెచ్చరించారు. తడిచిన విద్యుత్ స్తంభాలను, తడిచిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోకూడదన్నారు. ఉతికిన బట్టలను ఇనుప తీగలపై వేయకూడదని, ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నప్పుడు టీవీ, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైరు డ్యామేజ్ అయితే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆంక్షల పేరుతో నాటకాలను అడ్డుకోవడం తగదు

పామర్రు: ఆంక్షల పేరుతో పండుగలకు నిర్వహించే సాంఘిక నాటకాలను అడ్డుకోవడం సమంజసం కాదని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు అన్నారు. కుంతీదేవి పండుగ ఎస్సీల మనోభావాలకు సంబంధించిన అంశం అని, వారు కుంతీదేవిని తమ కులదైవంగా భావిస్తారని సంప్రదాయబద్ధంగా ఈ పండుగను ఆచరిస్తారని అన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రదర్శించే నాటకాలకు ఆటంకం తెలపడం వారి మనోభావాలను దెబ్బతీయటమే అవుతుందన్నారు. నాటకాలలో అశ్లీలత ఉంటే అడ్డుకోవాలే తప్ప నాటకాలను అడ్డుకోకూడదని అన్నారు. ఇప్పటి కైనా అధికారులు నాటక ప్రదర్శనలకు అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు.





అధికారులు అందుబాటులో ఉండాలి

ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్

మండవల్లి: అధికారులు మండలంలోని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎప్పటికప్పుడు తగిన సహకారం అందించాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆయా గ్రామాల్లోని ప్రజలకు కావలసిన వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్

దుర్గాదేవి అమ్మవారి విగ్రహ నిమజ్జనం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో దసరా నవరాత్రుల్ని ముగించుకున్న నిర్వాహకులు సోమవారం శ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. తొలుత గ్రామంలో వైభవంగా ఊరేగించారు. అడుగడుగునా అమ్మవారికి మహిళా భక్తులు హారతులు పట్టి పండ్లు, టెంకాయలను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిమజ్జన కార్యక్రమంలో చుక్కల ఉపేంద్ర, అజయ్, నందు, రాంబాబు, భాను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో అమ్మవారి ఊరేగింపు



గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కైకలూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా కైకలూరు ఎన్జీవోస్ కాలనీ, తామరకొల్లు, భైరవపట్నం, లింగాల, కానుకొల్లు గ్రామాల్లో వివిధ పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. కానుకొల్లులో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కుమారుడు రాయిగిరి రాము ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను కామినేని ప్రారంభించారు. జెడ్పీటీసీ కురేళ్ల బేబీ, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, కూటమి నేతలు పాల్గొన్నారు.



రహదారికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్,

భారీ అన్నసమారాధన

మండవల్లి: మండవల్లిలో ఉన్న శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండవల్లి, కొర్లపాడు, అప్పాపురం, అయ్యవారిరుద్రవరం, గన్నవరం, పెరికెగూడెం, మొఖాసాకలవపూడి గ్రామాలకు చెందిన భక్తులు సుమారు 3 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మండవల్లి: మండవల్లిలోని జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలను సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్రమణల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందుకే జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి కొండలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న సర్పంచ్ ఝాన్సీ, కార్యదర్శి కొండలు